కొత్త ఫ్లైఓవర్ కింద భారీ అగ్నిప్రమాదం



కొత్త ఫ్లైఓవర్ కింద కమ్ముకున్న పొగలు

అంబర్‌పేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఛేనెంబర్ చౌరస్తాలోని కొత్త ఫ్లైఓవర్ కింద మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పెద్దఎత్తున ఫ్లైఓవర్‌కు సంబంధించిన సామగ్రి కాలిపోయి, భారీస్థాయిలో ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తుంది. ఇటీవల అంబర్‌పేటలో ప్రారంభమైన నూతన ఫ్లైఓవర్‌కు సంబంధించి కొన్ని పెండింగ్ పనులు ఉండడంతో సాల్వ గార్డెన్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో వెల్డింగ్ పనులు ఉదయం చేపట్టారు. ఫ్లైఓవర్ కింద సామాన్లు నిలువ ఉంచే షెడ్ ఉంది. ఫ్లైఓవర్ పనుల కోసం వెల్డింగ్ చేస్తున్న సమయంలో అగ్గి రవ్వలు షెడ్‌లోని కరెంట్ తీగలపై పడ్డాయి. ఈ ఘటనతో వెంటనే షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో అక్కడ షెడ్‌లో ఉన్న ఫ్లైఓవర్‌కు సంబంధించిన పైపులు, రంగు డబ్బాలు, ప్లంబింగ్ సామగ్రికి మంటలు అంటుకున్నాయి. దీంతో మంటలు పెద్దగా చెలరేగి షెడ్ మొత్తం కాలిపోయింది. స్థానికులు వెంటనే ఫైర్‌సిబ్బందికి తెలియజేయగా ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఫ్లైఓవర్‌కు సంబంధించిన అధికారులు బుధవారం ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి, ప్రమాద నష్టాన్ని అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'విజయా డెయిరీని మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి వరంగల్, నిజామాబాద్‌లో ప్రభుత్వ విజయా డెయిరీ గుర్తులతో నాలుగు ప్రైవేట్ పాల డెయిరీలు ప్రజలను దోచుకుంటున్నాయని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి ఆరోపించారు. దీనిపై ప్రభుత్వ విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఈ అక్రమ వ్యాపారంతో రాష్ట్రంలో నిత్యం సుమారు నాలుగు లక్షల లీటర్ల కల్తీ పాల విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. అక్రమ వ్యాపారం చేస్తున్నవారిపై న్యాయపరమైన చర్యలు చేపడతామని చైర్మన్ అమిత్‌రెడ్డి హామీనిచ్చారని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులందరికీ విజయా డెయిరీ పాలు అందుబాటులోకి తెస్తామన్నారు. అంగన్‌వాడీ ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో తప్పనిసరిగా విజయా పాలు వాడేలా చర్యలు చేపట్టనున్నట్లు గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారన్నారు.

ఉర్రూతలూగించిన శేషు పాటల బహార్

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వర్తమాన సంగీత ప్రపంచంలో అపారమైన సేవలందిస్తున్న గొప్ప కళాకారుడు, ఘంటసాల వారి గీతాలకు తన గాత్రంతో తిరిగి ప్రాణం పోసి భవిష్యత్ తరాలకు ఆయన సంగీతాన్ని అందించే బాధ్యత తీసుకున్న మహానుభావుడు టి.శేషగిరిరావు అని ప్రముఖ పాత్రికేయుడు, సిటీ కల్చరల్ సెంటర్ అధినేత పురుషోత్తం నారగోని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రముఖ గాయకుడు టి.శేషగిరిరావు ఆధ్వర్యంలో 12 గంటల నిర్విరామ శేషు పాటల బహార్ కార్యక్రమం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కళాభారతి సిటీకల్చరల్ సెంటర్‌లో ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా శేషగిరిరావును సన్మానించారు. ఎంవీఏ.లక్ష్మి, ఉష మోడి(బుజ్జమ్మ), నివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బస్తీ సమస్యలు పరిష్కరించాలని గాంధీనగర్ డివిజన్ దోబీఘాట్ బస్తీవాసులు కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. బస్తీలో షాబాద్ బండలు వేయాలని, సివరేజీ, మంచినీటి నూతన పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలని అలాగే స్థానికుల అవసరం మేరకు బస్తీలో ఒక మంచినీటి నల్లా ఏర్పాటు చేయాలని కోరారు. దోబీఘాట్‌లో బస్తీవాసుల కోసం కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలన్నారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, శ్రీశాంతి రజక సహకార సంఘం ప్రతినిధులు నాగేష్, రమేష్, మల్లికార్జున్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల మహిళలకు పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంత మహిళలకు పురస్కారాలు బహూకరించే కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరై భాగ్యలక్ష్మి, కె.శ్రీలతావర్మకు జానపద గాయని శ్రీమణికి పురస్కారాలు బహూకరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన ఈ సభలో గానసభ పాలక మండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

8న శారదా విజయం సాహిత్యరూపక ప్రదర్శన

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నవ్యసాహితి సమితి, నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న సాయంత్రం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శారదా విజయం సాహితీ రూపక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు వేమరాజు విజయకుమార్ తెలిపారు. డా.జేఎల్ దుర్గ, ఉప్పలపాటి కుసుమకుమారి తదితర ప్రముఖ మహిళాకళాకారులు ఈ సాహితీరూపకం ప్రదర్శిస్తారన్నారు. సాహితీమూర్తులు ఓలేటి పార్వతీశం, గౌరీశంకర్, శరత్‌జ్యోత్స్నారాణి పాల్గొంటారన్నారు. మహిళాప్రముఖులైన రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర, కవయిత్రి ముక్తేవి భారతి, విద్యావేత్త కామిశెట్టి గోదాలక్ష్మి, నృత్యగురువు సుధామాలకు నవ్య మహిళాపురస్కారాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో నిర్వాహకులు ఆవిష్కరించారు.

8న 'మహిళలకు హింస నో' బహిరంగ సభ

నల్లకుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 8న మహిళలకు హింస నో అనే అంశంపై బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఐజీవో కోశాధికారి డాక్టర్ ఎస్.శాంతకుమారి, వోగ్స్ (ఓజీఎస్‌హెచ్) కార్యదర్శి డాక్టర్ మంజులరావు, ధీర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ జి.జమునాదేవి తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రసూతి గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ (ఓజీఎస్‌హెచ్), ఫోగ్సీ సంయుక్త ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్స్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన హెచ్ఎండీఏ మైదానంలో ఉదయం 6.30 గంటలకు ఈ బహిరంగ సభను వాక్‌థాన్ రన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్ డాక్టర్ జి.సురేందర్, యశోద ఆస్పత్రి ఎండీ డాక్టర్ సురేందర్‌రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా శ్రీషిరిడీ సాయిబాబా వార్షికోత్సవం

రాంనగర్: జెమినికాలనీలోని శ్రీషిరిడీ సాయిబాబా వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు డి.కౌశల్య, బి.రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం పంపిణీ



కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్ లాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రమోద్ ఆగర్వాల్, కౌశిక్, వరాలి, గోవిందరావు, డాక్టర్ సంగీత, నారాయణగౌడ్, మౌనిక, అరుణ తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునికీకరణ



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ జెమినీ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్‌ను పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమినీ కాలనీలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గోపాల్ జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ శివసాయి, జీహెచ్ఎంసీ డీఈలు సన్నీ, గీతా కుమారితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, రోడ్లు, కలుషిత నీటిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ అస్తవ్యస్తంగా మారడం వల్ల కలుషిత నీటి సరఫరా జరుగుతోందన్నారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, జెమినీ కాలనీ పెద్దలు బొల్లం పల్లి రాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ముషీరాబాద్, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, పూసగోరక్‌నాథ్, అరుణ్, ముచ్చుకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మణెమ్మగల్లీలో..

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ చౌరస్తా సమీపంలో గల మణెమ్మగల్లీలో హైడ్రా కూల్చిన భవన శిథిలాలను తొలగించి నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మణెమ్మగల్లీలో ఎమ్మెల్యే పర్యటించి స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ వీధిలో డ్రైనేజీ సమస్య దీర్ఘకాలంగా ఉందని నూతన లైన్ ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. నాలాపై హైడ్రా అధికారులు కూల్చిన శిథిలాల ప్రక్రియపూర్తి కాగానే డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణపనులతో పాటు రోడ్డు పనులు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ, సతీష్‌యాదవ్, శ్రీనివాస్, వైశాలి, రాజ్యలక్ష్మి, సుజాత, సంధ్య, వీరమణి, లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, కె.సురేందర్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఖదీర్, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మౌనదీక్ష



మౌనదీక్షలో పాల్గొన్న తెలంగాణ పద్మశాలీ సంఘం నేతలు

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేసిన గత ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, కులంపేరుతో దళారీ పనులుచేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహించవద్దని డిమాండ్ చేస్తూ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మౌనదీక్ష చేశారు. ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద ఆచార్యా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఈ దీక్షను నిర్వహించారు. తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని 3 గంటల పాటు దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలకాటి రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు వేముల బాల్‌రాజ్, బీసీ రాజకీయ చైతన్య అధ్యక్షుడు దూససురేష్, గుంటి నాగేష్, టీఆర్‌పీఎస్ కోశాధికారి బింగి నవీన్‌కుమార్ హాజరయ్యారు. ఈ దీక్షలో జీహెచ్ఎంసీ కన్వీనర్ పాశికంటి మల్లేష్, ఆఫీస్ కార్యదర్శి గంజి శ్రీనివాస్, వడిచెర్ల మారుతి, సూర్యప్రకాష్, వనమాల శంకర్, వలకాటి శ్రీనివాస్, ధ్రువకుమార్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కళాకారుల వేదిక ప్రతినిధులు

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోల్పోయిన తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కళాకారుల వేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కళాకారుల వేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఐలన్న, కన్వీనర్ ఎం.కుమారస్వామి, మోహన్ బైరాగి తదితరులు మాట్లాడారు. కళాకారుల సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని, 55 సంవత్సరాలు పూర్తయిన కళాకారులకు ప్రతి నెలా రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, ఇవ్వాలని, ఇవ్ఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కళాకారుడికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలన్నారు. ఇతర డిమాండ్లను కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, పూలమ్మ, దేశ్‌పాండే, ప్రఫుల్ రాంరెడ్డి, శరత్, స్కైలాబ్, కూర వెంకటయ్య, సాయికిరణ్, రమ, శ్రావణి, రజిత పాల్గొన్నారు.



డిప్యూటీ లేబర్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, అరుణ తదితరులు

కార్మిక సంక్షేమ బోర్డు పథకాలు ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ఇది కార్మిక సంక్షేమానికి గొడ్డలిపెట్టు వంటిదని, దీనిని ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ గంగాధర్‌కు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలకు ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని త్వరలో వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జి.అనురాధ, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షురాలు అరుణ, సహాయ కార్యదర్శి శోభబాబు, నాయకులు సత్యనారాయణ, నర్సింహ, యాదన్న, బాల్‌రాజ్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేవాలి



సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కవాడిగూడ డివిజన్ నూతన అధ్యక్షుడు దిలీప్‌యాదవ్

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేలా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఆరు డివిజన్‌లలో బీజేపీని గెలిపించి మేయర్ సీటును కైవసం చేసుకోవాలని ఆయన సూచించారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్ మంగళవారం బీజేపీ కవాడిగూడ డివిజన్ నూతన అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. బీజేపీ కార్యకర్తలతో కలిసి టిఫిన్స్ బైటక్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.రమేష్‌రాం, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురాం, మీసాల విఠల్‌రావు. ఘంట శ్రీనివాస్, బొల్ల రమేష్, రమేష్‌గౌడ్, సూర్యనారయాణగౌడ్, నరసింహచారి, పరశురాం తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం : లంకల దీపక్ రెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినందుకు స్వీట్లు తినిపిస్తున్న లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు



నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే వచ్చే తెలంగాణ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన మల్క కొమురయ్య విజయం పట్ల మంగళవారం బర్కత్‌పుర చమాన్ వద్ద బీజేపీ నేతలు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఎక్కాల నందు, సి.వినోద్‌యాదవ్, శ్యామ్‌రాజ్, సి.కృష్ణగౌడ్, ఎక్కాల కన్నా, ఎస్ఎస్.రామ్, చిట్టి శ్రీధర్, పి.గోవర్ధన్‌రెడ్డి, వర్కాల శ్రీకాంత్, క్షీరసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం సాధించడం పట్ల మంగళవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, బల్వీర్, క్షీరసాగర్, అరవింద్, వాసు, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, పంకజ్, రవియాదవ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ మంగళవారం న్యూపటేల్‌నగర్ నరేంద్రనగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీలో ప్రారంభించాల్సిన సీసీరోడ్డు నిర్మాణ పనులను అధికారులతో ఆయన చర్చించారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేకతను చూసే కిషన్‌రెడ్డిపై విమర్శలు

బర్కత్‌పుర: ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, ఏ ప్రాజెక్ట్‌ను అడ్డుకున్నారో బహిరంగ చర్చకు రావాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ సవాల్ విసిరారు. మంగళవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రప్పించడానికి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కృషి చేస్తున్నారన్నారు. దీనికి సహకారం అందించాల్సిన మంత్రులు ప్రాజెక్ట్‌లను అడ్డుకుంటున్నారని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



నెహ్రూనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ నెహ్రూనగర్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కె.రవిచారి కోరారు. మంగళవారం నెహ్రూనగర్‌లో బీజేపీ నాయకులు, స్థానికులతో కలిసి ఆయన పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. నెహ్రూనగర్‌లో జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునికీకరణ చేయాలని అప్పటి వరకు తరచూ డ్రైనేజీలైన్ లీకేజీ జరగకుండా చూడాలని సూచించారు. వేసవిలో కలుషిత నీటి సమస్యతోపాటు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జలమండలి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి బాగ్‌లింగంపల్లి సెక్షన్ మేనేజర్ జ్యోతి, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఇటీవల డివిజన్‌లోని పలు పార్కుల అభివృద్ధికి లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని పార్కులో అభివృద్ధి పనులను, పక్కనే ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంగళి వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి చిక్కడపల్లి వరకు పల్లకి సేవ జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షులు టి.రాంచందర్, ఎల్ల.సుబ్బయ్య, రాజగోపాల్, టి.సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ మాజీ కార్పొరేటర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.నర్సింహరావు, సభ్యులు శ్రీనివాసులు, రవిశంకర్, నారాయణ, మల్లికార్జున్, ఆదినారాయణ, కొండయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య?!



ఆదర్శ్

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకోబోతున్న ఓ క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు? కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న యాకయ్య కుమారుడు ఆదర్శ్(25) క్యాబ్ డ్రైవర్. ఐదేళ్లుగా నల్లకుంటలో నివాసం ఉంటున్న ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇరు కుటుంబాలు కూడా ఆమోదం తెలిపాయి. ఏప్రిల్‌లో వీరిద్దరికీ వివాహం కావాల్సి ఉంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఐరన్ బాక్స్ వైరుతో ఉరేసుకుంటున్నట్లు సరదాగా కాబోయే శ్రీమతిని ఆటపట్టించాలని అనుకున్నాడు. ఇదే క్రమంలో ఫొటో తీసి కాబోయే శ్రీమతికి పంపాడు. అదే సమయంలో పొరపాటుగా ఐరన్ బాక్స్ వైరు ఆదర్శ్ మెడకు బిగుసుకుపోయింది. దీంతో అతను మృతి చెందాడు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

రైలుకింద పడి గుర్తు తెలియని యువకుడు..

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.చిమ్మ తెలిపిన వివరాల ప్రకారం. విద్యానగర్ - కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి శరీరంపై నలుపు రంగు ఆఫ్ టీషర్ట్ అదే రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చిమ్మ తెలిపారు.

పెయింటర్ అదృశ్యం



సలావుద్దీన్

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పెయింటింగ్ పని మీద ఇంటి నుంచి వెళ్లిన ఓ పెయింటర్ అదృశ్యమయ్యాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న షాబుద్దీన్ కుమారుడు సలావుద్దీన్(33) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 25వ తేదీన పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో భార్య ఖైరూన్నిషా మంగళవారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాంనగర్: ముషీరాబాద్ పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. భోలక్‌పూర్ బీర్‌బన్‌గల్లీ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్ఐ జగదీష్ ఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన వ్యక్తిని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తెలిసిన వారు 8712660154 ఫోన్ నెంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.